క్లుప్తంగా

రెసిడెన్షియల్ ట్రైనింగ్‌లు రద్దు చేయాలి

వీరఘట్టం: ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ ట్రైనింగ్‌లు రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా గజపతినగరం బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న లీడర్‌షిప్ ట్రైనింగ్‌లో భామిని మండలం నేరడి ఎంపీపీ పాఠశాల హెచ్ఎం సిరిపురం శ్రీనివాసరావు గుండెపోటుతో గురువారం మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ మేరకు ఆయన మృతికి వీరఘట్టం మండలం దశుమంతపురం పాఠశాల వద్ద సహోపాధ్యాయులతో సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు బోనంగి దుర్గాప్రసాద్, తదితరులున్నారు.

వాతావరణ మార్పులతో అన్నదాత ఆందోళన



పెద్దూరులో పంట పొలాల్లో చేను కుప్పలు వేసిన రైతులు

గరుగుబిల్లి: మారిన వాతావరణ మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఆకాశం మబ్బులు పట్టి గాలులు వీస్తుండడంతో పంట చేనుపై ఆందోళన చెందుతున్నారు. ఎస్ఆర్‌పేట, పెదగుడబ, చినగుడబ, వల్లరగుడబ, ఖురద వెంకటాపురం, పెద్దూరు, దళాయివలస, నాగూరు, ఉల్లిబద్ర, గొట్టివలస తదితర గ్రామాల్లో చెరువులు, వర్షాధారంతో సుమారు ఆరు వేల ఎకరాల్లో వరి పంట కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మారిన వాతావరణ పరిస్థితుల్లో పంట చేలను ఎలా కాపాడుకోవాలో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంతాపం..



సంతాపం తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలకొండ: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు సిరిపురం శ్రీనివాసరావు మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలియజేశారు. విజయనగరం జిల్లా గజపతినగరంలో జరిగిన ఎస్ఎల్‌డీపీ శిక్షణ తరగతులకు హాజరై తీవ్ర ఒత్తిడితో గురువారం మరణించడం దురదృష్టకరమని పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మధరావు అన్నారు. ప్రభుత్వం అతని కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రౌతు హనుమంతురావు, కడగల రమణ, పాలవలస ధవళేశ్వరరావు, కనపాక సూర్యప్రకాశరావు, దుప్పాడ పాపినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టండి

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు తిరుపతిరావు

భామిని: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలను సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, ఎం.మన్మధరావు పిలుపునిచ్చారు. మండలంలోని ఇసుకగూడలో పార్టీ మండల కార్యదర్శి కొప్పర మిన్నారావు అధ్యక్షతన జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి విద్యుత్ చార్జీలను పెంచడం దారుణమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చార్జీల పెంపును తప్పుబట్టిన టీడీపీ అధికారంలోకి రాగానే ఎలా పెంచుతున్నారని ప్రశ్నించారు. రైతులకు ప్రకటించిన భరోసా సహాయం చెల్లించకుండా కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.జగన్నాయకులు, కొండగొర్రి ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

పార్వతీపురం టౌన్: పట్టణంలోని గుంతలు పడ్డ రహదారులకు మరమ్మతులు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జి.వెంకటరమణ డిమాండ్ చేశారు. పట్టణంలోని రహదారులపై పడిన గుంతల వద్ద గురువారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల గుంతల వల్ల పాదచారులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమా, పడాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు అధిగమిస్తే లాభాల సిరులు..

- వ్యవసాయాధికారి వాహిని
- అపరాల సాగుపై దృష్టి సారించిన రైతులు



పాలకొండ రూరల్:

ఈ ఏడాది వాతావరణం అనుకూలించడం మినహా అధికార యంత్రాంగం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు అన్నదాతకు అందలేదు. దీంతో వ్యవసాయ ఆటుపోట్లను ఎదుర్కొన్న రైతన్నలు అపరాల సేద్యంపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వరిపంట కోత దశకు చేరుకుంది. అయినప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాల జాడ పూర్తి స్థాయిలో కానరాకపోవడంతో యంత్రాల సాయంతో కోతలు పూర్తి చేస్తున్న రైతులు ప్రైవేట్ వ్యక్తులకు తక్కువ ధరకు ధాన్యం అమ్మకాలు చేస్తున్నారు. ఈ నష్టం పూడ్చేందుకు అపరాల సేద్యంపై ఆశలు పెట్టుకున్నారు. ఈ తరుణంలో పెసర, మినుము పంటల్లో మెలకువలు పాటించి తెగుళ్లు, పురుగులను నివారించగలిగితే మేలైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో అపరాల సేద్యం చేస్తున్న రైతులు సకాలంలో సమగ్ర సస్యరక్షణ చేపడితే మంచి దిగుబడిలభిస్తుందని వ్యవసాయాధికారిని ఎన్ని వాహిని స్పష్టం చేస్తున్నారు. తొలి దశలో అపరాలు చల్లిన రైతులకు పంట ప్రస్తుతం మొక్కదశకు చేరింది.

మచ్చల పురుగుతో ఇబ్బందులు....

అపరాల్లో మచ్చల పురుగుతో ఇబ్బందులు అధికం. ఈ పురుగు మొగ్గ, పూత, పిందె దశలో ఆశించి తీవ్ర ప్రభావం చూపుతాయి. పూత దశలో ఆశించినట్లయితే పూతను గూడుగా చేసుకుని లోపలి పదార్థాలను తినేస్తుంది. కాయలు తయారయ్యే దశలో కాయలను దగ్గర చేసి గింజలను తినడంతో పంట నష్టం, దిగుబడి తగ్గిపోవడం జరుగుతుంది. దీనిని అధిగమించేందుకు 5 శాతం వేపగింజల కషాయం లేదా 5 మి.లీ వేపనూనె లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

దీని వల్ల పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. మొగ్గ, పూత దశలో పిల్ల పురుగులను గుర్తిస్తే తక్షణమే క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ లేదా థయోడికార్బ్ ఒక గ్రాము, ఎసిఫేట్ ఒక గ్రాము లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పంటలో పురుగుల గూళ్లను అధిగమించేందుకు క్వినాల్‌ఫాస్ 2 ఎం.ఎల్‌ను లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయటం శ్రేయస్కరం.

పల్లాకు తెగులు నివారణ ఇలా...

పల్లాకు తెగులు (తెల్లదోమ) ద్వారా వ్యాపిస్తుంది. ఇది సోకిన మొక్కల్లోని ఆకులపై పసుపు, ఆకుపచ్చ రంగులో మచ్చలేర్పడతాయి. ఈ తెగులు ఆశించిన పంట తొలి దశలో పసుపు రంగులోకి మారుతుంది. దీని ప్రభావంతో పూత, పిందె ఏర్పడక అధిక నష్టం కలుగుతుంది. పూత, పిందె దశలో ఆశిస్తే పిందెలు, కాయలు పసుపు రంగులో మారి వంకరులు తిరిగి డొల్లలుగా మారిపోతాయి. తెల్లదోమ ఆకులోని రసాన్ని పీలుస్తాయి. పైరు ఎదుగుదలపై ప్రభావం కనపరుస్తాయి. వీటిని నియంత్రించేందుకు ట్రైజోఫాస్ 2 ఎం.ఎల్ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లీటర్ నీటిలో కలపి పిచికారీ చేయాలి. అలాగే తామరపురుగు తొలి దశలో లేత ఆకులపై వృద్ధి చెందుతుంది. ఆకుల అడుగు భాగంలో రసాన్ని పీల్చుకుని పంటను నష్టపరుస్తాయి. వీటిని అధిగమించేందుకు ఎసిఫేట్ గ్రాము లేదా పిప్రోనిల్ 1.5 ఎం.ఎల్ లేదా స్పైనోసాడ్ 0.3 ఎం.ఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పకడ్బందీగా నీటి సంఘ ఎన్నికలు



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ వెంకటరమణ, తదితరులు

వీరఘట్టం: వచ్చే నెల 8న జరగనున్న నీటి సంఘాల ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాయంలో ఎంపీడీఓ బి.వెంకటరమణతో కలసి ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేశారు. డిసెంబర్ 5న ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, ఈ నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ ఎలా చేయాలి.. పరిశీలన.. ఎన్నికల నిర్వహణ.. తదితర అంశాలపై వివరించారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈ డీవీ రమణ, ఎంఈఓ ఆర్.ఆనందరావు, మండల ఇంజినీరింగ్ అధికారి డి.కల్యాణిదుర్గ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోగులకు అంకితభావంతో సేవలందించాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ పద్మావతి



రావుపల్లిలోని వెల్‌నెస్ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

గరుగుబిల్లి: రోగులకు సేవలందించడంలో వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కేవీఎస్ పద్మావతి సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని రావుపల్లి సచివాలయంలో గురువారం జరిగిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలను, గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుకు రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు రక్త నమూనాలను సేకరించాలన్నారు. దీర్ఘకాలిక రోగులకు అవసరమైన మందులను అందజేయాలన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు రోజూ ఇంటింటి సందర్శన చేసి పీహెచ్‌సీలకు సంబంధిత సమాచారం తెలియజేయాలన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని సందర్శించి సిబ్బంది పనితీరు, వసతిగృహం పరిశుభ్రత, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. పాఠశాలలో రోగాల బారిన పడిన పిల్లల వివరాలను పరిశీలించారు. వైద్యాధికారి డాక్టర్ సాగర్‌వర్మ, సూపర్వైజర్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.77.18 కోట్లతో అంచనా బడ్జెట్



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన గురువారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.76,21,67,444ల సవరణ బడ్జెట్, 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి రూ.77,18,87,444ల అంచనా బడ్జెట్‌ను ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు ప్రవేశపెట్టగా సభ్యులంతా ఆమోదించారు. 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన తీర్మానాల్లోని పలు పనులు కార్యరూపం దాల్చినట్లు తెలియజేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, ఈఓపీఆర్‌డీ కె.ధర్మారావు పాల్గొన్నారు.

● సంఘీభావం..



ఐటీడీఏ ముఖద్వారం వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న గిరిజన గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు సీఐటీయూ సంఘ నాయకుడు యమ్మల మన్మధరావు సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అవుట్‌సోర్సింగ్ టీచింగ్ స్టాఫ్‌కు 2022 పీఆర్‌సీ ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. డీఎస్సీ నుంచి ఆ ఖాళీలను మినహాయించాలన్నారు. - సీతంపేట

● సందర్శన ..

సీతంపేట మండలంలోని కుశిమి, శంబాం, కిండంగి గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ కె.గీతాంజలి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది, ప్రజలతో మాట్లాడారు. హౌస్‌హోల్డ్ సర్వే, బ్యాంక్ ఖాతాకు ఆధార్ నంబర్ లింక్ చేయడం, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. అనంతరం కిండంగి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. -సీతంపేట



● రుణాలు చెల్లించాలి..



ప్రభుత్వం అందించిన స్త్రీ నిధి రుణాలను తిరిగి చెల్లించాలని సెర్ప్ స్త్రీ నిధి ఏజీఎం హేమలత అన్నారు. మండలంలోని నేరడి-బి, లోహరిజోల, వడ్డంగి గ్రామాల్లో గురువారం పర్యటించి రుణాలు తీసుకున్న మహిళలకు అవగాహన కల్పించారు. సకాలంలో రుణాలు చెల్లిస్తే మరోసారి రుణం సులువుగా మంజూరవుతుందని చెప్పారు. ఆమె వెంట వెలుగు ఏపీఎం మీసాల చక్రపాణి, సీసీ కృష్ణకుమారి, వెలుగు సీఓ ఎస్.రాజ్‌కుమార్, వీఓఏ భవానీ, తదితరులున్నారు. - భామిని

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



కొత్తపల్లిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీలు

గరుగుబిల్లి: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి గరుగుబిల్లి సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బాల్య వివాహాల నిరోధించడంపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం బాల్య వివాహాల నిషేధిత చట్టం ప్రభుత్వం రూపొందించిందన్నారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలను వినియోగించుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే ఆదర్శప్రాయుడు

- నగర పంచాయతీ వైస్ చైర్మన్ హనుమంతురావు



జ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలకొండ: జ్యోతిరావు పూలే ఆదర్శప్రాయుడని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ రౌతు హనుమంతురావు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గురువారం జ్యోతిరావుపూలే వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హనుమంతురావు మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జ్యోతిరావు పూలే లాంటి వ్యక్తులను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెలమల మన్మధరావు, పల్లా ప్రతాప్, దుప్పాడ పాపినాయుడు, కనపాక సూర్యప్రకాష్‌రావు, కడగల రమణ, ఎద్దు లిల్లీపుష్పనాథం, మరియదాస్, పాలవలస ధవళేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల ఉపకరణాల శిబిరం

గరుగుబిల్లి: కురుపాం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10గంటల నుంచి దివ్యాంగులు, వయోవృద్ధుల సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నటు ఎంపీడీఓ జి.పైడితల్లి గురువారం తెలిపారు. అలిమ్‌కో సంస్థ దివ్యాంగులకు, వయోవృద్ధులకు ఉపకరణాలు మంజూరు చేసేందుకు ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. శారీరక వైకల్యంతో బాధపడుతున్నవారు ఈ శిబిరంలో పాల్గొని అవసరమైన ఉపకరణాలను పొందాలన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతంలో హెల్త్ ఎమర్జెన్సీని వెంటనే ప్రకటించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇటీవల ఎక్కువగా జ్వరాలతో గిరిజనులు బాధపడుతున్నారని, జ్వరం తగ్గుతున్నప్పటికీ మోకాళ్లు, ఒంటి నొప్పులు అధికంగా ఉంటున్నాయని, వారాల తరబడి తగ్గటం లేదని, ఫలితంగా గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని నిర్మూలించేందుకు, గ్రామ స్థాయిలోనే సరైన వైద్య సేవలు అందించడం కోసం హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని కోరారు.

నీటి సంఘ ఎన్నికల నిర్వహణపై శిక్షణ



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏఈ మధు

భామిని: త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికకు సంబంధించి గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇరిగేషన్ ఏఈ ఆర్.మధు ఆధ్వర్యంలో, తహసీల్దార్ నీలాపు అప్పారావు పర్యవేక్షణలో మండల అధికారులు, సచివాలయ సిబ్బందికి స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ ఆర్.శివకుమార్, జెడ్పీ హెచ్ హెచ్ఎం కె.వెంకటరావు శిక్షణ ఇచ్చారు. జీసీసీ జీఎం సంధ్యారాణి, ఐటీడీఏ ఏఓ గణేష్, ఎంఏఓ సింహాచలం, భామిని, సీతంపేట సీడీపీఓలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విత్తనాలు సమకూర్చుకోవాలి

- నాబార్డు డీడీఎం దినేష్ కుమార్‌రెడ్డి



శిక్షణలో సూచనలు చేస్తున్న నాబార్డు డీడీఎం దినేష్‌కుమార్ రెడ్డి

గుమ్మలక్ష్మీపురం: పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరగడానికి మేలైన విత్తనాల ఎంపికే ప్రధానమని, కావున ప్రకృతి వ్యవసాయం చేస్తూ దిగుబడొచ్చిన పంటల నుంచే విత్తనాలను సమకూర్చుకుంటే లాభసాటిగా ఉంటుందని నాబార్డు డీడీఎం దినేష్‌కుమార్ అన్నారు. చాపరాయి బిన్నిడి పంచాయతీ బాతుగుడబ గ్రామంలో నాబార్డ్ ఆర్థిక సహాయంతో, జట్టు సంస్థ పర్యవేక్షణలో కొనసాగుతున్న జీవ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యమైన రైతులకు గురువారం విత్తన ఎంపిక, సస్యరక్షణ, పంట కోసిన తర్వాత చేయవలసిన యాజమన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ పి.షన్ముఖరాజు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీడీఎం రైతులతో మాట్లాడుతూ రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తుండడం శుభపరిణామమని, రైతులకు ఉన్న సాగు విస్తీర్ణంలో 365 రోజుల పాటు పంటలు సాగు చేస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని, అందుకు తగిన ప్రోత్సాహం అందిస్తామని సూచించారు. అనంతరం దేశీయ విత్తనాల ప్రదర్శనను పరిశీలించారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, రైతులు తాడంగి జమ్మయ్య, గీత, పి.లక్ష్మీ, కో ఆర్డినేటర్ జి.ప్రభోద్ తదితరులు ఉన్నారు.

బ్యాంకు వివరాలు అపరిచితులతో పంచుకోవద్దు



కురుపాం వారపు సంత వద్ద సంకల్పం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎస్ఐ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): బ్యాంకు వివరాలను అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. కురుపాం గ్రామంలో గురువారం జరిగిన వారపు సంత ప్రదేశం వద్ద పరిసర గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మత్తు పదార్థాలు, రోడ్ సేఫ్టీ, బాల్యవివాహాల పట్ల అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్‌ను వచ్చే ఓటీపీని చెప్పడం వలన బ్యాంకు ఖాతాలోని నగదును దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా నమ్మిస్తుంటారని, అటువంటి వారి మాయమాటలకు లొంగకూడదన్నారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

● వైభవంగా అష్టలక్ష్మీయాగం



భామిని మండలం ఘనసర కాలనీలో నిర్వహించిన అష్టలక్ష్మీయాగం గురువారంతో వైభవంగా ముగిసింది. వందలాది మంది భక్తుల సమక్షంలో యాగం పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ అర్చకుడు గుడిమెట్ల శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో బత్తిలి పురోహితుడు రంపా లలితప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన యాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎరుకుమజ్జి అప్పలనాయుడు, రామ్‌ప్రసాద్ పాత్రో, తదితరులు పాల్గొన్నారు. – భామిని

గృహాల జియోట్యాగింగ్ పూర్తి చేయాలి



జియో ట్యాగింగ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయరంగారావు

పాలకొండ: గృహ నిర్మాణాలకు సంబంధించి జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని ఎంపీడీఓ విజయరంగారావు ఆదేశించారు. మండలంలోని అంపిలి, అన్నవరం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న జియో ట్యాగింగ్ పరిశీలించి, సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ నెల 30న సామాజిక పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

బాలికల ఆరోగ్యంపై ఆరా..



నినాదాలు చేస్తున్న విద్యార్థినులు, పీహెచ్‌సీ, పాఠశాల సిబ్బంది

పాలకొండ రూరల్: మండలంలోని చిన మంగళాపురం హైస్కూల్‌లో రాష్ట్రీయ బాలల సంరక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నవరం పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎస్.జగదీశ్వరి విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా తీశారు. పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థినులతో ప్రదర్శన నిర్వహించి ఆరోగ్య సూత్రాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎస్ఓ కిమిడి రాణి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.